

ఓటరు నమోదుకు మరో ఛాన్స్



- 2025 జనవరి 1 నాటికి 18 ఏళ్లు నిండిన వారు అర్హులు
- ఈనెల 20 నుంచి ఇంటింటి సర్వే
- అక్టోబరు 29న ఓటరు ముసాయిదా విడుదల
- 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా
- జిల్లాలో 4.72 లక్షల మంది ఓటర్లు
- 1,500 మంది ఓటర్లకు పైగా ఉంటే కేంద్రాల క్రమబద్ధీకరణ
- ప్రత్యేక శిబిరాల ద్వారా ఓటు నమోదుకు చర్యలు
- స్థానిక ఎన్నికల నేపథ్యంలో పల్లెల్లో హడావుడి



ఓటరు అవగాహన ర్యాలీ (ఫైల్)

(ఆంధ్రజ్యోతి, సిరిసిల్ల)

ఓటరు నమోదుకు మరో ఛాన్స్ వచ్చింది. 2025 జనవరి 1వ తేదీ నాటికి 18 ఏళ్లు నిండే వారు కొత్తగా ఓటరు నమోదు చేయించుకోవడానికి అవకాశం ఇచ్చారు. ఓటరు జాబితాను పకడ్బందీగా రూపొందించే దిశగా ఓటరు జాబితా సవరణ-2025 ప్రక్రియను మొదలు పెట్టారు. చేర్పులు, మార్పు లతో పాటు బోగస్ కార్డుల ఏరివేత మృతుల పేర్లు తొలగింపు, ఓటరు కార్డుకు ఆధార్ అనుసంధానం, కొత్త దరఖాస్తుల స్వీకరణ వంటి చర్యలు పకడ్బం దీగా చేపట దానికి అధికారులు సన్నద్ధం అయ్యారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో ఈ నెల 20 నుంచి అక్టోబరు 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించనున్నారు. బీఎల్‌వోలు ఇంటింటికి వెళ్లి ఓటర్ల వివరాలను పరిశీలించనున్నారు. అక్టోబరు 29న ముసా యిదా ఓటరు జాబితాను విడుదల చేయనున్నారు. నవంబరు 29న జాబితాపై ప్రజల నుంచి అభ్యంత రాలు స్వీకరించనున్నారు. శని, ఆదివారాలు ప్రత్యేక క్యాంపులు కూడా నిర్వహించాలని ఎన్నికల కమిషన్ ఆదేశాలు ఇచ్చింది. ఓటర్ల నుంచి వచ్చిన దరఖాస్తులు, అభ్యంతరాలు పరిష్కరించి 2025 జనవరి 6న తుది ఓటరు జాబితాను రూపొందించనున్నారు.

పల్లెల్లో ఆశావాహుల సందడి...

గ్రామ పంచాయతీ, జడ్పీటీసీ, ఎంపీటీసీల ఎన్నికలు త్వరలో నిర్వహించనున్న నేపథ్యంలో రాజన్న సిరిసిల్ల జిల్లాలోని పల్లెల్లో ఓటరు నమోదు సందడి ఏర్పడింది. స్థానిక సంస్థల ఎన్నికలకు కూడా ప్రస్తుతం ఎన్నికల కమిషన్ రూపొందిస్తున్న వివరాలు, నమోదైన ఓటర్ల జాబితాలనే తీసుకోనున్న నేపథ్యంలో గ్రామాల్లో స్థానిక ఎన్నికల్లో పోటీకి ఉత్సాహం చూపుతున్న ఆశావాహులు తమకు అనుకూలంగా ఉండే యువత ఓట్లను నమోదు చేయించడానికి సిద్ధమయ్యారు. ఓటరు నమోదుకు దగ్గరే ఉండి యువతను ప్రోత్సహించే దిశగా చూస్తున్నారు. ఓటరు నమోదు ప్రక్రియతో స్థానిక ఎన్నికలు వచ్చినట్లుగానే భావిస్తున్నారు.

● రెండు సెగ్మెంట్లలో 4.72 లక్షల మంది ఓటర్లు

జిల్లాలో ప్రధానంగా ఉన్న సిరిసిల్ల, వేములవాడ రెండు సెగ్మెంట్లలో 4,72,735 మంది ఓటర్లు ఉండగా పురుషులు 2,27,840 మంది, మహిళలు 2,44,856 మంది ఉన్నారు. జెండర్ 39 మంది ఉన్నారు. 17,016 మంది మహిళ ఓటర్లే అత్యధికంగా ఉన్నారు. సిరిసిల్ల సెగ్మెంట్‌లో 2,46,547 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,19,749 మంది మహిళలు 1,26,791 మంది ఉన్నారు. జెండర్ 7 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 7042 మంది అధికంగా ఉన్నారు. వేములవాడ సెగ్మెంట్‌లో 2,26,188 మంది ఓటర్లు ఉండగా పురుషులు 1,08,091 మంది, మహిళలు 1,18,065 మంది ఉన్నారు. జెండర్ 32 మంది ఉన్నారు. ఇందులో మహిళలు 9,974 మంది అధికంగా ఉన్నారు.

● ఇంటిల్లిపాది ఓట్లు ఒకే చోట...

ఎన్నికల సమయాల్లో పోలింగ్ కేంద్రాల సర్దుబాటు క్రమంలో కుటుంబ సభ్యుల ఓటర్లు పోలింగ్ బూత్‌లు మారిపోవడం జరుగుతుంది. ఈ సారి ఇంటిల్లి పాది ఓటర్లు ఒకే చోట ఉండే విధంగా చర్యలు చేపడుతు న్నారు. గతంలోనే ఆధార్ అనుసంధానంతో డబుల్ ఓట్లను తొలగించారు. మరోసారి పకడ్బందీగా ఓటరు జాబితాను తయారు చేయనున్నారు. ఒక్కో పోలింగ్ కేంద్రంలో 1500 ఓటర్లకు మించి ఉండకుండా పోలింగ్ కేంద్రాలను గుర్తిస్తారు. అదనంగా ఉంటే అవసరమైన చోట నూతన పోలింగ్ కేంద్రాలను ఏర్పాటు చేస్తారు.

ఓటరుగా నమోదు కావాలంటే...

- ఓటరు నమోదుకు అర్హత 18సంవత్సరాలు పూరైనవారు ఓటర్ల నమోదు, చేర్పులు, తొలగింపులు, సవరింపులు చేసుకోవచ్చు.
- నిర్ణత నమూనాలో ఉన్న ఫారములను ముందుగా నింపాల్సి ఉంటుంది.
- ఫారం 6: కొత్తగా ఓటర్ల జాబితాలో పేరు చేర్చేందుకు క్లయిమ్ దరఖాస్తు.
- ఫారం 7: ఓటరు జాబితాలో పేరు చేర్చేందుకు సంబంధించి అభ్యంతరం తెలపటానికి, జాబితాలోంచి పేరు తొలగించడానికి దరఖాస్తు.
- ఫారం 8: ఓటరు జాబితాలో సవరణలు చేయడానికి దరఖాస్తు.
- ఫారం 8ఏ: ఓటరు జాబితాలో పేరును మరో చోటికి బదిలీ చేయటానికి దరఖాస్తు.
- ఈ ఫారములలో నింపి సంబంధిత తహసీల్ కార్యాలయంలో లేదా బీఎల్‌వోలకు ఇవ్వాల్సి ఉంటుంది.

ఈ- రిజిస్ట్రేషన్ చేయడం ఎలా...

- ఎన్నికల కమిషన్ సూచించిన అన్ని ఫారములను ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో ఈ రిజిస్ట్రేషన్ కోసం అందుబాటులో ఉంచారు.
- అర్హత కలిగిన యువకులు, మొదట ఎన్నికల కమిషన్ వెబ్‌సైట్‌లో లాగిన్ కావాలి.
- వెబ్‌సైట్‌లో చీఫ్ ఎలక్షన్ ఆఫీసర్ పేరుతో ఉన్న వెబ్‌సైట్ వస్తుంది. దీంట్లో పైన ఈ రిజిస్ట్రేషన్ కనిపిస్తుంది. దాన్ని క్లిక్ చేస్తే కొత్తగా చేరే వారి కోసం, చేర్పులు, మార్పులు, అభ్యంతరాలకు సంబంధించిన ఫారములు కనిపిస్తాయి.
- కొత్తగా చేరే వారు ఫాం 6పైన క్లిక్ చేస్తే ఫాం వస్తుంది. అందులో తమ వివరాలను పొందపరుచాలి.
- వివరాలను పొందపర్చిన తరువాత తెలుగులో ట్రాన్స్‌లేట్ కోసం ఆప్షన్ కూడా ఉంటుంది.
- ఫారం పూర్తి చేసిన తరువాత ఫొటోను అప్‌లోడ్ చేయాలి.
- ఫారం 6 నింపడం పూర్తయిన తరువాత సేవ్ చేసి ట్రాన్స్‌ఫర్ బటన్ క్లిక్ చేయాలి. ఆ తరువాత యునిక్యూ ఆప్లికేషన్ ఐడి నంబర్ వస్తుంది. ఆ నంబర్ ద్వారా అప్‌లోడ్ చేసిన దరఖాస్తు స్టేటస్‌ను చూసుకోవచ్చు.
- ఓటరుగా ఈ రిజిస్ట్రేషన్ చేసిన దరఖాస్తును సంబంధిత తహసీల్దార్, డౌన్‌లోడ్ చేసుకొని సమర్పించిన వివరాలపై విచారణ జరుపుతారు.

● ప్రత్యేక శిబిరాలు నిర్వహించినా..

ఓటరు నమోదు పక్రియ ప్రతీ సంవత్సరం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తూ ప్రచారం చేసినా యువత ఓటరు నమోదు ప్రక్రియ నామామాత్రంగానే ఉంటుంది. ప్రతీ సంవత్సరం జిల్లా వ్యాప్తంగా డిగ్రీ, బీటెక్, ఇతర ఉన్నత చదువులు పొంది బయటకు వస్తున్న విద్యార్థులు దాదాపు 8 వేలకు పైగా ఉంటున్నారు. వీరి నమోదు మాత్రం తక్కువగా ఉంటుంది. ఈ సారి 2025 ఓటరు రివిజన్‌లో నమోదు చేసుకునే విధంగా విస్తృతంగా ప్రచారం చేయనున్నారు. యువత ఓటరుగా నమోదు కావాలని, కళాశాలల్లో అవగాహన కార్యక్రమాలు చేపట్టనున్నారు. సామాన్యుడు సైతం ఓటుతోనే రాజకీయాలు, పార్టీల భవిష్యత్తులను మార్చివేసే సత్తా ఉంటుంది. ఎన్నికలు రాగానే ఓటర్లను ప్రసన్నం చేసుకోవడానికి నేతలందరూ ఓటు దేవోభవ అంటూ వేడుకుంటారు. ఓటుకు రాజకీయ నేతల భవిష్యత్ చూపుడువేలుకు పెట్టే సిరా చుక్కతో తారుమారవుతుంది. మనిషికి ఒక వజ్రాయుధంగా రాజ్యాంగం ప్రతీ ఒక్కరికి కల్పించిన హక్కు ఓటుహక్కు. ఓటుహక్కు పొందడానికి ఎన్నికల కమీషన్ విస్తృతంగా ప్రచారం నిర్వహిస్తోంది. దేశంలో 18 ఏళ్లు నిండిన ప్రతీ ఒక్కరు అర్హులుగా కమిషన్ ఆధునిక సాంకేతిక మార్గాల ద్వారా కూడా ఇందుకోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తోంది. ఆధార్ లింకేజిని కూడా ఓటరు గుర్తింపునకు చేశారు. కలర్ గుర్తింపు కార్డులుకూడా కమిషన్ అందిస్తుంది. దేశంలో రాష్ట్రపతి నుంచి గ్రామపంచాయతీ వార్డు సభ్యుడి వరకు, అత్యున్నత అధికారి నుంచి అటెండర్ వరకు, ధనిక, పేద తేడా లేకుండా అందరికి ఒకే విధమైన గుర్తింపు కార్డు ఓటరు కార్డు మాత్రమే. భారత ఎన్నికల సంఘం జారీ చేసే గుర్తింపు కార్డు వల్ల ఎన్నో ఉపయోగాలు ఉన్నాయి.

ప్రతి ఒక్కరూ ఓటరుగా నమోదు కావాలి

- రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సుదర్శన్‌రెడ్డి
- కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్, అధికారులు

సిరిసిల్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): 18 సంవత్సరాలు నిండిన ప్రతి ఒక్కరిని ఓటరుగా నమోదు చేస్తూ ఓటరు జాబితాలో చోటు కల్పిస్తూ పకడ్బందీగా జాబితా రూపొందించాలని రాష్ట్ర ముఖ్య ఎన్నికల అధికారి సి సుదర్శన్‌రెడ్డి అధికారులను అదేశించారు. శనివారం హైదరాబాద్ నుంచి అదనపు సీఈవో లోకేష్‌కుమార్‌తో కలిసి ఓటరు జాబితా సవరణపై జిల్లా కలెక్టర్‌లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. జనవరి 1, 2025 ఓటరు జాబితా సవరణ కట్టుదిట్టంగా నిర్వహించాలని ఓటరు జాబితా నమోదు ప్రక్రియపై రాజకీయ పార్టీలతో సమావేశం నిర్వహించాలని సూచించారు. ఆగస్టు 20 నుంచి 28 వరకు ప్రీ రివిజన్ నిర్వహించి 29న ముసాయిదా జాబితా విడుదల చేయాలని నవంబరు 28 వరకు ప్రజల నుంచి అభ్యంతరాలను స్వీకరించాలని అన్నారు. రెండు శనివారాలు, అదివారాలు ప్రత్యేక శిబిరాలు నిర్వహించి డిసెంబరు 24 లోగా వాటిని పరిష్కరించి 2025 జనవరి 6న తుది ఓటరు జాబితా విడుదల చేయాలన్నారు. ఆగస్టు 20 నుంచి అక్టోబరు 18 వరకు బీఎల్‌వోలు ఇంటింటికి తిరిగి అవసరమైన చోట పాత ఫొటోలు తొలగించి కొత్తవి అప్‌లోడ్ చేయాలన్నారు. 2025 జనవరి 1 నాటికి 18 సంవత్సరాలు నిండిన వారందరూ ఓటరు జాబితాలో నమోదు కావాలన్నారు. మరణించిన వారి ఓటర్ల వివరాలను, శాశ్వతంగా వలస వెళ్లిన ఓటర్ల వివరాలను జాబితా నుంచి తొలగించాలన్నారు. 1500ల మంది ఓటర్లకు మించి ఉన్న పోలింగ్ కేంద్రాలను క్రమబద్ధీకరణ చేయాలని సూచించారు. ఓటరు నమోదుకు ప్రత్యేక కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ రాజన్న సిరిసిల్ల జిల్లాలో పెండింగ్‌లో ఉన్న 139 ఫాం 8 దరఖాస్తులను త్వరగాపరిష్కరించేందుకు కృషిచేస్తామని, నిర్ధేశించిన షెడ్యూల్ ప్రకారం ఇంటింటి సర్వే చేపట్టి ప్రతి ఒక్కరికి ఓటు హక్కు కల్పిస్తామని అన్నారు. కాన్ఫరెన్స్‌లో అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్, వేములవాడ సిరిసిల్ల అర్డీవోలు రాజేశ్వర్, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

సామాజిక కార్యక్రమాల్లో పోలీసుల పాత్ర అభినందనీయం

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్



గిరిజన మహిళా రైతుకు డ్రైవింగ్ లైసెన్స్ అందజేస్తున్న ఆది శ్రీనివాస్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 17: సామాజిక కార్యక్రమాల్లో పోలీసుల పాత్ర అభినందనీయమని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం సిరిసిల్ల టౌన్ పోలీస్‌స్టేషన్‌లో పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన డ్రైవింగ్ లైసెన్స్ మేళాలో భాగంగా అర్హత సాధించిన రుద్రంగి, వీర్నపల్లి మండల పోలీస్‌స్టేషన్‌ల పరిధిలోని 72మంది యువతీ, యువకులకు, రైతులకు కలెక్టర్, ఎస్పీలతో కలిసి ఆయన డ్రైవింగ్ లైసెన్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోలీస్ శాఖ ఆధ్వర్యంలో మంచి కార్యక్రమానికి నాంది పలికారని, శాంతి భద్రతలతో పాటు అనేక సామాజిక కార్యక్రమాలు చేపడుతున్న జిల్లా పోలీసుల కృషి అభినందనీయమన్నారు. అంతకుముందు కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా మాట్లాడుతూ జిల్లాలో ట్రాఫిక్ నియంత్రణ, రోడ్డు ప్రమాదాల నివారణకు తీసుకుంటున్న చర్యలపై పోలీస్ యంత్రాంగం కృషి అభినందనీయం అన్నారు. లైసెన్స్ మేళాలో భాగంగా అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రాన్ని ఉపయోగించుకోవాలన్నారు.

ఎస్పీ అఖిల్ మహాజన్ మాట్లాడు తూ జిల్లా వాహనాల తనిఖీ సమయాల్లో అధిక సంఖ్యలో వాహనదారులు లైసెన్స్ లేకుండా వాహనాలు నడుపుతున్నారని గుర్తించామన్నారు. లైసెన్స్ లేకుండా వాహనాలు నడపడం నేరమని, జిల్లాలో లైసెన్స్ తీసుకోవడానికి చాలా మంది వాహనదారులు పడుతున్న ఇబ్బందులు పరిగణలోకి తీసుకొని పోలీస్‌శాఖ ఆధ్వర్యంలో నిర్ణీత రుసుముతో దశలవారీగా లైసెన్స్ మేళా నిర్వహించి లైసెన్స్‌లు అందిస్తున్నామన్నారు. ప్రతీ ఒక్కరు ట్రాఫిక్ రూల్స్ పాటించాలన్నారు. డ్రైవింగ్ లైసెన్స్, హెల్మెట్ ఉండాలన్నారు. కార్యక్రమంలో డీఎస్పీ చంద్రశేఖ ర్‌రెడ్డి, డీటీవో లక్ష్మణ్, సీఐలు కృష్ణ, వెంకటేశ్వర్లు, ఎస్ఐలు పాల్గొన్నారు.

అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధికి దరఖాస్తుల ఆహ్వానం

సిరిసిల్ల కలెక్టరేట్, అగస్టు 17: డాక్టర్ బీఆర్ అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకానికి జిల్లాలో అర్హులైన ఎస్సీ విద్యార్థులు దరఖాస్తులు చేసుకోవాలని జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ అధికారి ఎం విజయలక్ష్మీ శనివారం ఒక ప్రకటనలో కోరారు. 2024-25 విద్యాసంవత్సరానికి గాను రాష్ట్ర ప్రభుత్వం విదేశీ విద్యాలయాలల్లో ఉన్నత విద్యను అభ్యసించేందుకు షెడ్యూల్డ్ కులాల అభివృద్ధిశాఖ నుంచి నిర్వహించబడుచున్న అంబేద్కర్ ఓవర్సీస్ విద్యానిధి పథకంలో ఎస్సీ కులాలకు చెందిన విద్యార్థులకు రూ 20లక్షల స్కాలర్‌షిప్‌లను అందించడానికి నిర్ణయించడం జరిగిందని పేర్కొన్నారు. విదేశీ విశ్వవిద్యాలయాల్లో పోస్ట్ గ్రాడియేషన్, ప్రొఫెషనల్ కోర్సుల్లో చదువుకునే ఎస్సీ విద్యార్థులు 13-10-2024వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

పునరావాస పథకాన్ని సద్వినియోగం చేసుకోవాలి

- అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్

సిరిసిల్ల కలెక్టరేట్, అగసు 17: దివ్యాంగులకు ఆర్థిక సహాయం అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేసిన పునరావాస పథకాన్ని దివ్యాంగులు సద్వినియోగం చేసుకోవాలని అదనపు కలెక్టర్ ఖీమ్యానాయక్ కోరారు. జిల్లా కలెక్టరేట్‌లోని అదనపు కలెక్టర్ ఛాంబర్‌లో శనివారం పునరావాస పథకం లబ్ధిదారుల ఎంపిక కోసం ఇంటర్వ్యూలను నిర్వహించారు. మండలస్థాయి కమిటీ నుంచి పంపిన లబ్ధిదారులకు జిల్లా స్థాయి కమిటీ ఆధ్వర్యంలో జరిగిన ఇంటర్వ్యూలకు జిల్లా వ్యాప్తంగా ఎంపికైన 32 మంది దివ్యాంగులల్లో 28 మంది హాజరయ్యారు. వీరందరికి జిల్లా స్థాయి కమిటీ అధ్వర్యంలో ఇంటర్వ్యూలను నిర్వహించి ఎంపిక చేశారు. ఎంపికైన వారి జాబితాలను త్వరలోనే విడుదల చేస్తామని అదనపు కలెక్టర్ ప్రకటించారు. కార్యక్రమంలో జిల్లా సంక్షేమ అధికారి లక్ష్మీరాజం, కమిటీ సభ్యులు డీఆర్‌డీఏ శేషాద్రి, మెప్మా పీడీ రాజేశం, ఎస్సీ కార్పోరేషన్ ఈడీ స్వప్న తదితరులు పాల్గొన్నారు.

మండల బంద్ ప్రశాంతం



ఎల్లారెడ్డిపేటలో మూసి ఉన్న దుకాణాలు

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17: బంగ్లాదేశ్‌లో హిందువులపై జరుగుతున్న దాడులను నిరసిస్తూ హిందూ ఉత్సవ సమితి ఆధ్వర్యంలో శనివారం తలపెట్టిన ఎల్లారెడ్డిపేట మండల బంద్ ప్రశాంతంగా ముగిసింది. మండల కేంద్రంతో పాటు ఆయా గ్రామాల్లోని వ్యాపార, వాణిజ్య, ప్రైవేటు విద్యా సంస్థలు స్వచ్ఛందంగా బంద్ పాటించాయి. హిందూ ఉత్సవ సమితి సభ్యులు ర్యాలీ తీస్తూ తెరచి ఉన్న దుకాణాలను మూసి వేయించారు. బంద్‌కు సహకరించిన వ్యాపారులు, ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఉత్సవ సమితి సభ్యులు పాల్గొన్నారు.

ఎంపీడీవో కార్యాలయం సందర్శన

గంభీరావుపేట, ఆగస్టు 17: గంభీరావుపేట మండల పరిషత్ కార్యాలయాన్ని జడ్పీ సీఈవో వినోద్ శనివారం సందర్శించారు. పెండింగ్ బిల్లుల కోసం మాజీ సర్పంచ్‌లు ఇటీవల ఎంపీడీవో ఆఫీస్ ఎదుట నిరసన చేపట్టిన అంశాన్ని ఈ సందర్భంగా అధికారులతో సీఈవో వినోద్ ప్రస్తావించారు. మాజీ సర్పంచ్‌లు ఇచ్చిన పెండింగ్ బిల్లులకు సంబధించిన పత్రాన్ని సీఈవో వినోద్ పరిశీలించారు. మొదటిసారి సీఈవో వినోద్ ఆఫీస్‌కు వచ్చిన సందర్భంగా సిబ్బంది సన్మానించారు. ఎంపీడీవో రాజేందర్, ఎంపీవో రాజేశ్వర్‌గౌడ్, జూనియర్ అసిస్టెంట్ శంకర్, టైపిస్ట్ ఇందిర, కంప్యూటర్ ఆపరేటర్లు హరీష్, సత్యం, భాస్కర్ తదితరులు ఉన్నారు.

ప్రజలకు భద్రత కల్పించేందుకే 'మీ కోసం'

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17: ప్రజలకు భద్రత కల్పించడంతో పాటు పలు సామాజిక కార్యక్రమాలను చేపట్టాలనే లక్ష్యంతో పోలీసు శాఖ 'మీ కోసం' కార్యక్రమానికి శ్రీకారం చుట్టిందని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. మండలంలోని అక్కపల్లిలో పోలీసు శాఖ ఆధ్వర్యంలో శనివారం రాత్రి 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ పల్లె ప్రజలు ప్రశాంత వాతావరణంలో జీవించేలా చర్యలు చేపడుతున్నామన్నారు. ప్రజలకు మరింతా చేరువై సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని అన్నారు. ఏ సమస్య ఎదురైనా నేరుగా తమకు సమాచారం అందిస్తే పరిష్కారానికి కృషిచేస్తామని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. కార్యక్రమంలో ఎస్ఐ రమాకాంత్, సిబ్బంది పాల్గొన్నారు.

వీర్నపల్లి: మారుమూల గ్రామాల ప్రజలకు సైబర్ నేరాలపై అవగాహన ఉండాలని సీఐ శ్రీనివాస్‌గౌడ్ అన్నారు. వీర్నపల్లి మండలం గర్జనపల్లిలో శనివారం రాత్రి 'మీ కోసం' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐ శ్రీనివాస్‌గౌడ్ మాట్లాడుతూ ప్రజలు సైబర్ నేరాలకు గురైనప్పుడు హెల్ప్‌లైన్ నంబర్ 1930కు సమాచారం అందించాలన్నారు. యువతకు మత్తు పదార్థాలకు అలవాటు పడకుండా తల్లిదండ్రులపై పిల్లలపై దృష్టి పెట్టాలన్నారు. ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలిగినా డయల్ 100కు సమాచారం అందించాలని అన్నారు. ఎస్ఐ ఎల్లాగౌడ్, సిబ్బంది, స్థానికులు పాల్గొన్నారు.

ఆసుపత్రుల్లో నిలిచిన వైద్య సేవలు



సిరిసిల్లలో ధర్నా చేస్తున్న అసోసియేషన్ సభ్యులు



సిరిసిల్ల నర్సింగ్ కళశాల వద్ద నిరసన తెలుపుతున్న విద్యార్థినులు

సిరిసిల్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): కోల్‌కత్తాలోని ఆర్జీకర్ అసుపత్రిలో జూనియర్ డాక్టర్‌పై జరిగిన హత్యాచారానికి నిరసనగా జిల్లాలో డాక్టర్లు నిరసన వ్యక్తం చేశారు. ఐఎంఏ పిలుపు మేరకు శనివారం జిల్లాలోని ప్రైవేటు అసుపత్రుల్లో సేవలు నిలిపివేశారు. ర్యాలీలు, నిర్వహించారు. ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో సిరిసిల్ల నర్సింగ్ కళాశాల విద్యార్థులు నిరసన ధర్నా కార్యక్రమం చేపట్టారు. మహిళలకు రక్షణ కల్పించాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ రాష్ట్ర కన్వీనర్ పూజ మాట్లాడుతూ దేశంలో అమ్మాయిలకు రక్షణ కల్పించాలని కోల్‌కత్తాలో సంఘటన జరిగి వారం రోజులు అవుతున్న మమతా బెనర్జీ స్పందించకపోవడం సిగ్గుచేటని అన్నారు. జూనియర్ వైద్యురాలి మృతిపై సమగ్ర విచారణ జరిపి శిక్షించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి మల్లారపు ప్రశాంత్, సాయి, సాయిభరత్, సాత్విక, ఇమ్రా, శరణ్య, నిఖిత తదితరులు పాల్గొన్నారు. ఇండియన్ డెంటల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి కరీంనగర్ జిల్లాలో చేపట్టిన నిరసన కార్యక్రమానికి రాజన్న సిరిసిల్ల జిల్లా నుంచి డాక్టర్లు తరలివెళ్లారు. నిరసనలో సిరిసిల్ల నుంచి డెంటల్ అసోసియేషన్ అధ్యక్షుడు డాక్టర్ ఎస్ సతీష్, కార్యదర్శి పి రాజు, డాక్టర్ సతీష్, డాక్టర్ వంశీ, డాక్టర్ భాస్కర్, డాక్టర్ శ్యాం, డాక్టర్ రాజేందర్, డాక్టర్ శ్రీనాథ్‌రెడ్డి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ విద్యాసాగర్‌పాల్గొన్నారు.

సిరిసిల్ల టౌన్: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన ట్రైనీ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ శనివారం సిరిసిల్ల ప్రైవేటు హాస్పిటల్ స్టాఫ్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ర్యాలీ, ధర్నా చేపట్టారు. స్థానిక అంబేద్కర్ చౌరస్తా నుంచి గాంధీచౌక్ వరకు అసోసియేషన్ సభ్యులు ర్యాలీ నిర్వహించారు. అనంతరం గాంధీచౌక్ వద్ద ట్రైనీ డాక్టర్ కుటుంబానికి న్యాయం చేయాలంటూ నినాదాలు చేస్తూ ధర్నా చేపట్టారు. కార్యక్రమంలో అసోసియేషన్ సభ్యులు సంతోష్, కృష్ణ, గౌస్ శంకర్, మహేస్, రఘు, నాయక్ పాల్గొన్నారు.

గంభీరావుపేట/ఎల్లారెడ్డిపేట: గంభీరావుపేట, ఎల్లారెడ్డిపేట మండలంలోని పలు ప్రైవేటు, ప్రభుత్వ ఆసుపత్రుల్లో 24 గంటల పాటు ఓపీ వైద్య సేవలను శనివారం నిలిపి వేశారు. గంభీరావుపేట ప్రభుత్వ ఆసుపత్రి వైద్య సిబ్బంది ప్లకార్డులతో నిరసన కార్యక్రమాన్ని చేపట్టారు.

● నిందితులను కఠినంగా శిక్షించాలి..

వేములవాడ: జూనియర్ వైద్యురాలిపై దారుణంగా అత్యాచారం చేసి హత్యకు పాల్పడిన నిందితులను కఠినంగా శిక్షించి వైద్యులకు తగిన రక్షణ కల్పించాలని ఐఎంఏ జిల్లా ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు డాక్టర్ చీకోటి సంతోష్ కుమార్ డిమాండ్ చేశారు. వైద్యురాలి హత్యను నిరసిస్తూ శనివారం వేములవాడ పట్టణంలోని అన్ని ప్రైవేటు ఆసుపత్రులలో వైద్యులు అవుట్ పేషంట్ సేవలను నిలిపివేసి నిరసన వ్యక్తం చేశారు. వైద్యులకు సంఘీభావం తెలిపిన బీజేజీ జిల్లా అధ్యక్షుడు ప్రతాప రామకృష్ణ మాట్లాడుతూ కలకత్తాలో వైద్యురాలిని అత్యంత కిరాతకంగా హత్య చేసిన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

అక్రమంగా తరలిస్తున్న రేషన్ బియ్యం పట్టివేత

మంథని రూరల్, ఆగస్టు 17: మండలంలోని సిద్ధిపల్లి వద్ద ఆటో ట్రాలీలో అక్రమంగా తరలిస్తున్న 5 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని శనివారం సివిల్ సప్లై అధికారులు పట్టుకున్నారు. ఎలాంటి అనుమతులు లేకుండా ట్రాలీలో తరలిస్తున్న బియ్యాన్ని మంథని పోలీసు స్టేషన్ అప్పగించి నట్లు ఎస్ఐ రమేష్ తెలిపారు. సివిల్ సప్లై అధికారుల ఫిర్యాదు మేరకు ఆటో డ్రైవర్ అంజి, మరో వ్యక్తి రమేష్‌లపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

కారు నుంచి దట్టమైన పొగలు

భయబ్రాంతులకు గురైన వాహనదారులు



కారు నుంచి వస్తున్న పొగలు


జమ్మికుంట, ఆగస్టు 17: పట్టణంలోని రైల్వే ఓవర్ బ్రిడ్జిపై నుంచి హుజూరాబాద్ వెళ్తున్న ఓ కారు నుంచి శనివారం ఒక్కసారిగా దట్టమైన పొగలు వెలువడ్డాయి. దీంతో కారులో ఉన్న వారు భయపడి కిందకు దిగి దూరంగా వెళ్లారు. కారు సమీపంలో ఉన్న వాహనదారులు భయాందోళనకు గురయ్యారు. ఇంజన్ నుంచి పొగలు వస్తుండటంతో కారు పేలుతుందనే భయంతో పరుగులు పెట్టారు. కాసేపటికి పొగలు తగ్గడంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు.



చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లిన బస్సు

తప్పిన ప్రాణాపాయం

జగిత్యాలరూరల్, ఆగస్టు 17 : నిర్మల్ డిపోకు చెందిన ఆర్టీసీ బస్సుకు శనివారం పెనుప్రమాదం తప్పింది. శనివారం జగిత్యాల బస్టాండ్‌లో సుమారు 100 మంది ప్రయాణికులను ఎక్కించుకొని జగిత్యాల నుంచి ఖానాపూర్‌కు వెళ్తుంది. ఈ క్రమంలో బస్సు ప్రయా ణిస్తున్న క్రమంలో ఆకస్మాత్తుగా జగిత్యాల రూరల్ మండలంలోని చల్‌గల్- మోర పల్లి గ్రామాల శివారులో బస్సు డ్రైవర్ వెనుక వైపు ఉన్న రెండు చక్రాలు ఊడి పొలాల్లోకి దూసుకెళ్లాయి.. దీంతో బస్సు ఒక్కసారిగా కిందకు పడి ఒకేవైపు కుంగడంతో ప్రయాణికులు ఒక్కసారిగా కేకలు వేసి భయాందోళనకు గురయ్యారు. డ్రైవర్ చాకచక్యంగా వ్యవహరించడంతో బస్సులో ప్రయాణిస్తున్న 100 మందికి ఎలాంటి ప్రమాదం కాలేదు. దీంతో బస్సులో ఉన్న వారంతా ఊపిరి పీల్చుకున్నారు. మరో బస్సు ఏర్పాటు చేసి వారిని గమ్యస్థానానికి చేర్చారు.



పిల్లల కిడ్నాప్ కేసులో ఇద్దరి అరెస్ట్

● 3.50 లక్షలకు ఇద్దరు ఆడ పిల్లల అమ్మకం ● వివరాలు వెల్లడించిన సీఐ

మెట్‌పల్లి, అగస్టు 17(ఇబ్రహీంపట్నం): ప్రియుడి మోజులో పడ్డ ఓ తల్లి తన ఇద్దరు కూతుళ్లను అమ్ముకుంది. కని పెంచిన అమ్మే ప్రియుడితో కలిసి సొంత బిడ్డలను అమ్ముకుంది. చివరికి ప్రియుడితో పాటు ఆమె కూడా కటకటాల పాలైంది. ఇద్దరినీ మెట్‌పల్లి పోలీసులు పక్కా ప్లాన్ వేసి పట్టుకుని అరెస్ట్ చేశారు. మెట్‌పల్లి సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపిన వివరాల ప్రకారం నిజామాబాద్ జిల్లా సారంగాపూర్‌కు చెందిన ఇస్లావత్ లావణ్య (జమున)కు ఎనిమిదేళ్ల క్రితం ఫకీర నాయక్‌తో పెళ్లైంది. లావణ్యకు ఇద్దరు అడపిల్లలున్నారు. రెండేళ్ల క్రితం భర్తతో విబేధాలు రావడంతో వదిలేసి ఒంటరిగా ఉంటోంది. ఈ క్రమంలో లావణ్య ఇబ్రహీంపట్నం మండలం కోమటి కొండపూర్‌లోని ఓ దాబాలో పని చేస్తుండగా అమ్మక్క పేటకు చెందిన ఇస్లావత్ నాగేష్‌తో పరిచయం ఏర్పడి అది వివాహేతర సంబంధానికి దారి తీసింది. ఈ క్రమంలో లావణ్య ఇద్దరు అడపిల్లలను ప్రియుడితో కలిసి అమ్మాలని అనుకుంది. అనాథ పిల్లలని నమ్మించి మేడిపల్లి మండలం పోరుమల్ల గ్రామానికి ఆరేళ్ల బాలిక వైష్ణవిని 2 లక్షలు, మెట్‌పల్లి పట్టణంలోని హన్‌మాన్ నగర్‌కు చెందిన ఒకరికి మూడేళ్ల బాలిక కృష్ణవేణిని 1.50 లక్షలకు అమ్మింది. ఇదే క్రమంలో బాబు కావాలని ఒకరు అడుగగా 1.50 లక్షలకు డీల్ కుదుర్చుకుని పథకం ప్రకారం ఈ నెల 13న నాగేష్ మెట్‌పల్లిలోని దుబ్బవాడలో రెండేళ్ల బాలుడిని కిడ్నాప్ చేసి దొరిపోయాడు.


కిడ్నాప్‌నకు పాల్పడిన నాగేష్

నాగేష్‌ను పట్టుకున్న పోలీస్‌లు కిడ్నాప్ వ్యవహారంలో మరింత లోతుగా విచారణ చేయగా ఇద్దరు అడపిల్లలను అమ్మిన విషయం వెలుగులోకి వచ్చింది. కిడ్నాప్‌లకు పాల్పడుతున్న ఇద్దరిని పట్టుకునేందుకు సీఐ నిరంజన్‌రెడ్డి నేతృత్వంలో మెట్‌పల్లి ఎస్‌ఐ చిరంజీవి ప్రత్యేక టీంగా ఏర్పడి గాలిస్తుండగా పట్టణంలోని చావిడి వద్ద కిరాయి ఉంటున్న ఇంట్లో ఉన్న ఇద్దరిని అరెస్ట్ చేసి మేజిస్ట్రేట్ ముందు హాజరు పరచినట్లు సీఐ నిరంజన్‌రెడ్డి తెలిపారు. ఇద్దరు చిన్నారులను శిశు సంరక్షణా కేంద్రానికి తరలించినట్లు తెలిపారు. నాగేష్‌పై గతంలో నిజామాబాద్ జిల్లా కమ్మర్‌పల్లి, జగిత్యాల జిల్లా మెట్‌పల్లి, ఇబ్రహీంపట్నంలో పలు దొంగతనాలలో కేసులు నమోదైనట్లు సీఐ తెలిపారు.

'మిడ్ మానేరు'లోకి కొనసాగుతున్న ఎత్తిపోతలు

కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటి విడుదల

బోయినపల్లి, ఆగస్టు 17: మండలంలోని మిడ్ మానేరు ప్రాజెక్టులోకి ఎల్లంపల్లి నుంచి గాయత్రి పంప్ హౌస్ ద్వారా 4,500 క్యూసెక్కుల, మూల వాగు నుంచి 590 క్యూసెక్కుల ఇన్ ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటిమట్టం 318 మీటర్ల గాను ప్రస్తుతం 312.44 ఉండగా, నీటి నిల్వ సామర్థ్యం 27.54 టీఎంసీలకు గాను ప్రస్తుతం 15.38 టీఎంసీల మేరకు నీరు నిల్వ ఉంది. కాగా మిడ్ మానేరు నుంచి అన్నపూర్ణ రిజర్వాయర్‌కు 3,200, కుడి కాలువకు వంద క్యూసెక్కుల నీటిని తరలిస్తున్నారు.

అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి...

ఇల్లంతకుంట: ఇల్లంతకుంట మండలంలోని అనంతగిరి సమీపంలోని అన్నపూర్ణ రిజర్వాయర్‌లోకి నీటి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. 3.5 టీఎంసీల సామర్థ్యం ఉన్న అన్నపూర్ణ రిజర్వాయర్‌లో 2.13 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మధ్యమానేరు నుంచి 3600 క్యూసెక్కుల నీటిని రెండు పంపుల ద్వారా ఎత్తిపోస్తుండగా రంగనాయకసాగర్‌కు 3300 క్యూసెక్కుల నీటిని విడుదల చేస్తున్నారు.

శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి కొనసాగుతున్న ఎత్తిపోతలు

పెద్దపల్లి, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి):శ్రీపాద ఎల్లంపల్లి ప్రాజెక్టు నుంచి మిడ్ మానేరులోకి ఎత్తిపోతలు కొనసాగుతున్నాయి. శనివారం సాయంత్రం వరకు ప్రాజెక్టు లోకి ఎగువ ప్రాంతం నుంచి 10865 క్యూసెక్కుల వరద నీరు వస్తుండగా నంది, గాయత్రి పంప్‌హౌస్‌ల ద్వారా మిడ్ మానేరులోకి రెండు మోటార్ల ద్వారా 6300 క్యూసెక్కుల నీటిని ఎత్తిపోస్తున్నారు. ఎన్టీపీసీకి, హైదరాబాద్, ఆయా నియోజకవర్గాల ప్రజల తాగు నీటి అవసరాల కోసం 452 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు. ప్రాజెక్టు పూర్తి స్థాయి నీటి మట్టం 20.175 టీఎంసీలు కాగా, ప్రస్తుతం 14.449 టీఎంసీల నీళ్లు ఉన్నాయి.

కాకతీయ కాలువకు కొనసాగిన నీటి విడుదల

జగిత్యాల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): శ్రీరాంసాగర్ ప్రాజెక్టు నుంచి కాకతీయ కాలువకు కాలువకు 4,200 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ఎస్సారెస్పీలోకి 15,320 క్యూసెక్కుల ఇన్‌ఫ్లో వచ్చి చేరుతోంది. ప్రాజెక్టులో ప్రస్తుతం 48.518 టీఎంసీల నీరు నిల్వ ఉంది. మిషన్ భగీరథ, సాగు నీటి అవసరాలకు ప్రాజెక్టు నుంచి 5,453 క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు.

చిన్నాన్నను కేసులో ఇరికించేందుకు యువకుడి కట్టుకథ

● కిడ్నాప్‌నకు గురైనట్లు డ్రామా ● పోలీసుల విచారణలో బయటపడిన వ్యవహారం

చందుర్తి, ఆగస్టు 17: భూ వివాదంలో ప్రత్యర్థులను కేసుల్లో ఇరికించడానికి యువకుడు అల్లిన కట్టుకథ వీడింది. పోలీసుల విచారణలో కిడ్నాప్ వ్యవహారం డ్రామాగా తేలింది. శనివారం చందుర్తి పోలీస్‌స్టేషన్‌లో సీఐ వెంకటేశ్వర్లు, ఎస్సై శ్రీకాంత్ వివరాలు వెల్లడించారు. చందుర్తి మండలం ఆశిరెడ్డిపల్లికి చెందిన ఎక్కలదేవి గంగరాజుకు అదే గ్రామానికి చెందిన అతడి చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్యకు మధ్య కొంత కాలంగా భూమి విషయంలో గొడవలు జరుగుతున్నాయి. గొడవలకు సంబంధించి గంగరాజు రెండు కేసుల్లో నిందితుడిగా ఉన్నాడు. ఈ నేపథ్యంలో తన చిన్నాన్నతోపాటు అతడి కుమారులు, మరో ముగ్గురిని క్రిమినల్ కేసుల్లో ఇరికించాలని ప్లాన్ వేశాడు. ఈ క్రమంలో గురువారం గంగరాజు అదృశ్యమయ్యాడు. అదే రోజు ఉదయం పొలం వద్ద ద్విచక్ర వాహనం, చెప్పులు షర్టు, మొబైల్ ఫోన్ చిందరవందరగా పడి ఉండడం గ్రామస్థులకు కనిపించడంతో కుటుంబ సభ్యులకు, పోలీసులకు సమాచారం అందించారు. సంఘటన స్థలాన్ని పరిశీలించిన పోలీసులు కేసు నమోదు చేసి వెంటనే గాలింపు చేపట్టారు. చుట్టుపక్కల వ్యవసాయ బావుల్లో వెతికించారు. ఆచూకీ లభించలేదు. శుక్రవారం తెల్లవారు జామున పొలం పనులకు వెళ్తున్న రైతులకు చేతులు, కాళ్లకు తాళ్లు కట్టి ఒంటిపై దుస్తులు లేకుండా, ముఖంపైనా, ఒంటిపైనా బురదతో గంగరాజు కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసు లు సంఘటన స్థలానికి చేరుకుని గంగరాజును అదుపులోకి తీసుకొని పోలీస్ స్టేషన్‌కు తరలిం చారు. అతడిని విచరించగా గుర్తుతెలియని వ్యక్తులు తన చేతులు, కాళ్లను కట్టేసి అడవిలో వదిలి వెళ్లినట్లు గంగరాజు పోలీసులతో కథ అల్లాడు. గంగరాజు వ్యవహారశైలిపై అనుమానం వచ్చిన పోలీసులు లోతుగా విచారణ చేపట్టడంతో కిడ్నాప్ వ్యవహారం బయటపడింది. తన చిన్నాన్న ఎక్కలదేవి రాజయ్య, అతడి కూమారులు భూమి విషయంలో జోక్యం చేసుకోకుండా ఉండేందుకు, వారిని కేసుల్లో ఇరికించి భయపెట్టేందుకు కిడ్నాప్ డ్రామా ఆడినట్లు విచారణలో తేలిందని సీఐ తెలిపారు.

ధర్మపురి క్షేత్రంలో శ్రావణ భక్తుల రద్దీ


స్వామివారి దర్శనానికి బారులు తీరిన భక్తులు

ధర్మపురి, ఆగస్టు 17: శ్రావణ మాసం పురస్కరించుకుని ధర్మపురి క్షేత్రంలో రెండో శనివారం భక్తుల రద్దీ పెరిగింది. స్థానిక శ్రీ లక్ష్మీ నరసింహ స్వామి అనుబంధ ఆలయాల్లో ఉదయం ఆలయ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య అర్చకులు ప్రత్యేక పూజలు చేశారు. స్వామి వారలకు పంచోపనిషత్తులతో ప్రత్యేక అభిషేకం, సప్త హారతులు, నివేదన, నీరాజన, మంత్రపుష్పాలు జరిపారు. అంతకు ముందు భక్తులు గోదావరి నదిలో స్నానాలు ఆచరించిన అనంతరం ఆలయాలకు చేరు కుని స్వామి వారలను దర్శించుకున్నారు. ఆలయం పక్షాన ఈవో సంకటాల శ్రీనివాస్ ఆధ్వర్యంలో సిబ్బంది భక్తులకు తగు సేవలు అందించారు. ఈ కార్యక్రమంలో ఆలయ ఈవో సంకటాల శ్రీని వాస్, ఆలయ వేదపండితులు బొజ్జ రమేష్‌శర్మ, సామవేద పండితులు ముత్యాలశర్మ, పాలెపు ప్రవీణ్‌కుమార్, ఆలయ ఉపప్రధాన అర్చకులు నేరెళ్ల శ్రీనివాసాచార్యులు, ఆలయ అర్చకులు, సూపరింటెండెంట్ ద్యావళ్ల కిరణ్ కుమార్, సీనియర్ అసిస్టెంట్ అలువాల శ్రీనివాస్ పాల్గొన్నారు.

వరదకాలువలో పడ్డ ట్రాక్టర్ వెలికితీత


వరదకాలువలో నుంచి పైకి తీస్తున్న ట్రాక్టర్

మల్యాల, ఆగస్టు 17: రెండు రోజుల క్రితం వరదకాలువలో పడ్డ ట్రాక్టర్‌ను శనివారం వెలికి తీశారు. మండలంలోని రాంపూర్ శివారులో గురువారం ట్రేలర్‌తో పాటు ట్రాక్టర్ వరద కాలువలో పడింది. నీరు అధికంగా ఉండడంతో బయటకు తీసే ప్రయత్నాలు ఫలించ లేదు. దీంతో శనివారం ఇరిగేషన్ అధికారులు పంప్‌హౌజ్ వద్ద గల గేట్లను ఓపెన్ చేయడంతో కాలువలోని నీరు తగ్గుముఖం పట్టాయి. నీరు తగ్గి ట్రాక్టర్ తేలడంతో గ్రామస్థులు రెండు జేసీబీల సహాయంతో తాళ్లు కట్టి కాలువ పైకి తీశారు.

21న జాబ్ మేళా

కరీంనగర్ టౌన్, ఆగస్టు 17: నగరంలోని సిటీ సెంటర్ కాంప్లెక్స్‌లో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ కంపెనీ మహిళల కోసం ప్రత్యేకంగా జాబ్ మేళా నిర్వహిస్తున్నట్లు మేయర్ యాదగిరి సునీల్‌రావు తెలిపారు. శనివారం సంస్థ కార్యాలయంలో మేయర్ చేతుల మీదుగా జాబ్ మేళా పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ 30 నుంచి 35 ఏళ్ల వయసు గల మహిళలకు ఉపాధి కల్పించేందుకు ఈ జాబ్ మేళా నిర్వహిస్తున్నారని, డిగ్రీ ఉత్తీర్ణత సాధించిన వారు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని సూచించారు. కార్యక్రమంలో రిలయన్స్ నిప్పాన్ లైఫ్ సీనియర్ మేనేజర్ మాకులూరి రాం మోహన్, మేనేజర్ సిరిసిల్ల ప్రసాద్ పాల్గొన్నారు. పూర్తి వివరాలకు 9848168440 నంబర్‌లో సంప్రదించాలని సూచించారు.

పర్సు దొంగిలిస్తున్న మహిళ పట్టివేత

కరీంనగర్ క్రైం, ఆగస్టు 17: కరీంనగర్ ఆర్టీసీ బస్టాండ్‌లో ఒక ప్రయాణికురాలి నుంచి పర్సు, సెల్‌ఫోన్‌లను ఓ మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ సెక్యూరిటీ పోలీసులు శనివారం పట్టుకున్నారు. బస్టాండ్‌లోని ఇన్‌గేట్ వద్ద హైదరాబాద్‌కు చెందిన శ్రుతి అనే మహిళా ప్రయాణికురాలు బస్సు దిగుతుండగా ఆమె పర్సు, సెల్‌ఫోన్‌ను విజయవాడకు చెందిన మాధవి అనే మహిళ దొంగిలిస్తుండగా ఆర్టీసీ విజిలెన్స్ సెక్యూరిటీ ఏఎస్ఐ ఎం.లక్‌పతి, హెడ్ కానిస్టేబుల్ ఎం.సాగర్, వైసారయ్య, మానసలు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. పట్టుబడిన మహిళ వద్ద నుంచి 3 పర్సులు, ఒక బంగారు గాజు, 42 వేల నగదును స్వాధీనం చేసుకుని, ఒకటో టౌన్ పోలీసులకు అప్పగించామని ఆర్టీసీ సెక్యూరిటీ అధికారులు తెలిపారు.

చికిత్స పొందుతూ యువకుడి మృతి


వినోద్‌కుమార్ (ఫైల్)

మానకొండూర్, ఆగస్టు 17: మానసిక స్థితి సరిగా లేక ఓ యువకుడు పురుగుల మందు తాగి చికిత్స పొందుతూ మృతి చెందాడు. శంకరపట్నం మండలంలోని ముత్తారం గ్రామానికి చెందిన నాయిని వినోద్‌కుమార్ (32)కు మానసిక స్థితి సరిగా లేకపోవడంతో పలు ఆసుపత్రుల్లో చికిత్స చేయించారు. శుక్రవారం పశువుల కొట్టంలో పురుగుల మందు తాగి అపస్మారక స్థితిలోకి వెళ్లాడు. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం కరీంనగర్ ఆసుపత్రికి తరలించారు. చికిత్స పొందుతూ శనివారం మృతి చెందాడు. వినోద్‌కుమార్ తండ్రి మల్లయ్య ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు స్టేషన్ ఇన్‌చార్జి మొగిలి తెలిపారు.

విద్యుదాఘాతంతో రైతు మృతి


రంగయ్య (ఫైల్)

ఇల్లంతకుంట, ఆగస్టు 17: మండలంలోని రేపాక గ్రామానికి చెందిన మొగిలోజు రంగయ్య (70) అనే రైతు విద్యుదాఘాతంతో శనివారం మృతి చెందాడు. ఎస్సై శ్రీకాంత్‌గౌడ్ తెలిపిన వివరాల ప్రకారం రంగయ్య శనివారం వ్యవసాయ బావివద్ద పొలంలోని ఒడ్లు చెక్కడానికి వెళ్లాడు. అక్కడే ఉన్న విద్యుత్‌స్తంభం సపోర్టు వైరుకు తగిలాడు. సపోర్టు వైర్‌కు విద్యుత్ సరఫరా అవుతుండటంతో రంగయ్య విద్యుదాఘాతానికి గురై మృతిచెందాడు. మృతుడు రంగయ్య భార్య సత్తవ్వ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

గంజాయి విక్రయదారుల అరెస్ట్

సిరిసిల్ల క్రైం, ఆగస్టు 17: సిరిసిల్ల పట్టణంలోని సుందరయ్యనగర్‌కు చెందిన ఒల్లెపు వంశీ (24), ఒల్లెపు భీంరాజ్ (20)అనే గంజాయి విక్రయదారులను శనివారం అరెస్ట్ చేశామని టౌన్ సీఐ కె. కృష్ణ తెలిపారు. వీరి వద్ద 200 గ్రాముల గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. వీరు హైద్రాబాద్‌లో గంజాయి కొనుగోలుచేసి సిరిసిల్లకు వచ్చి విద్యానగర్‌లోని వైకుంఠధామం వద్ద ఇతరులకు విక్రయించేందుకు ప్రయత్నిస్తుండగా సమాచారం వచ్చిందన్నారు. దీంతో అన్నదమ్ములను పట్టుకొని విచారించగా వారి వద్ద 200 గ్రాముల గంజాయి లభించిందన్నారు. వెంటనే ఇద్దరిని అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించామని వివరించారు.

ఘనంగా శ్రీ భూ ఆదివరహా స్వామి కల్యాణ మహోత్సవం


కల్యాణం నిర్వహిస్తున్న అర్చకులు

కమాన్‌పూర్, ఆగస్టు 17: మండల కేంద్రంలోని ఆదివరహాస్వామి ఆలయంలో స్వామివారి కల్యాణ మహోత్సవం అంగరంగ వైభవంగా శనివారం జరిగింది. స్వామి వారి జయంత్యుత్సవాల్లో భాగంగా వేదపండితులు కనుకుంట్ల వరప్రసాద్ శ్రీనివాసాచార్యులు, రామాంజనేయుల ఆధ్వర్యంలో స్వామివారి కల్యాణోత్సవం జరిగింది. ఉదయం నిత్యాభిషేకం, గోపూజ, తీర్థ ప్రసాద గోష్టి అలాగే నిత్య పూర్ణాహుతి, తీర్థ ప్రసాద గోష్టి, శ్రీవిష్ణు సహస్రనామ స్తోత్ర పారాయణం, నిత్య హోమం, పూర్ణాహుతి తదితర వాటిని ఘనంగా నిర్వహించారు. భక్తులు స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఆలయ ఈవో కాంతారెడ్డి ప్రత్యేక ఏర్పాట్లు చేశారు. మాదాసు రవీందర్ సుజాత దంపతులు అన్నదానం నిర్వహించారు.

అధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశం

ఆధ్యాత్మిక సంపదకు మారుపేరు భారతదేశమేనని శ్రీకాకుళం జిల్లా ఇచ్ఛాపురం శరణ్య పీఠాధిపతి శ్రీ బాల బ్రహ్మానంద సర్వసతి మహాస్వామి అన్నారు. శనివారం మండల కేంద్రంలోని ఆదివరాహ స్వామి ఆలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాలకు హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రపంచ దేశాలకు అధ్యాత్మిక సంపదను అందిస్తున్న ఏకైక దేశం భారతదేశమన్నారు. ఆధ్యాత్మిక సంపదకు మూలాధారాలు దేవాలయాలు, గ్రంథాలు, భగవద్గీత, రామాయణం, భాగవతం, వేదాలు మాత్రమేనన్నారు. అనంతరం ఆయనను ఆలయ అర్చకులు, ప్రముఖులు సత్కరించారు. ఈ కార్యక్రమంలో ఈవో కాంతారెడ్డి, అసిస్టెంట్ కమిషనర్ సుప్రియ, దేవాదయ ఇన్స్‌పెక్టర్ సుజాత, ఈవో శంకర్ తదితరులు ఉన్నారు.


బాల బ్రహ్మానంద సర్వసతిని సన్మానిస్తున్న అర్చకులు, అధికారులు





రైతు రుణ మాఫీ దేశ చరిత్రలోనే రికార్డు

- ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్

వేములవాడ, ఆగస్టు 17: రైతు రుణమాఫీ కార్యక్రమం భారతదేశ చరిత్రలోనే సరికొత్త రికార్డు అని వేములవాడ శాసనసభ్యుడు, రాష్ట్ర ప్రభుత్వ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం ఆయన స్థానికంగా విలేకరులతో మాట్లాడుతూ రైతు రుణమాఫీ విషయంలో ప్రజలకు ఇచ్చిన మాటను రాష్ట్ర ప్రభుత్వం నిలబెట్టుకున్నదన్నారు. ఆగస్టు 15వ తేదీ లోగా రైతులకు ఏకకాలంలో రూ.2 లక్షల రుణమాఫీ చేసి తీరుతామని ప్రకటించిన ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి అమలు చేసి చూపించారన్నారు. రుణమాఫీ పైన బీఆర్‌ఎస్ పార్టీది అక్కసు మాత్రమే అని, హరీష్‌రావు కేటీఆర్ రైతులను కావాలనే రెచ్చగొడుతున్నారని అన్నారు. సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులను రోడ్లపైకి తీసుకువచ్చే ప్రయత్నం చేస్తున్నారన్నారు. పదేళ్లలో కేసీఆర్ చేయలేని పని నెలరోజుల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి చేశారని తెలిపారు.

● రుణమాఫీ కానివారికోసం గ్రీవెన్స్ సెల్..

వేములవాడ రూరల్: సాంకేతిక కారణాలతో రుణమాఫీ కాని రైతులకోసం గ్రీవెన్స్ సెల్ ఏర్పాటు చేశామని ప్రభుత్వ విప్ వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. వట్టెంల గ్రామంలో ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘం ఆధ్వర్యంలో 23 లక్షల రూపాయలతో నిర్మిస్తున్న నూతన గోదాంకు ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్, నాఫ్స్‌కాబ్ చైర్మన్ కొండూరి రవీందర్ రావుతో కలిసి శనివారం భూమిపూజ నిర్వహించారు.



గోదాం నిర్మాణానికి భూమి పూజ నిర్వహిస్తున్న విప్ ఆది శ్రీనివాస్

అనంతరం ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడుతూ దేశ చరిత్రలోనే ఏకకాలంలో రుణమాఫీ చేసిన ఘనత రాష్ట్ర ప్రభుత్వానిదేనన్నారు. ప్యాక్స్ చైర్మన్ ఏనుగు తిరుపతి రెడ్డి, మాజీ ఎంపీపీ రంగు వెంకటేశం, నాయకులు సంపు స్వామి, రొండి రాజు, తిరుపతి, జైపాల్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

● బాలుడికి మెరుగైన వైద్యసేవలు అందించాలి..

వేములవాడ టౌన్: వేములవాడ మండలం అరెపల్లి గ్రామానికి చెందిన నడిగొట్ల రాజేష్ లావణ్య దంపతుల కుమారు ప్రజ్వాల్ బిల్డింగ్‌పై నుంచి పడటంతో తలకు తీవ్రగాయాలయ్యాయి. దీంతో హైదరాబాద్‌లోని ప్రైవేటు ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. వైద్య ఖర్చులకు ఇబ్బందులు తలెత్తడంతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ దృష్టికి స్థానికులు తీసుకువచ్చారు. దీంతో స్పందించిన ఆది శ్రీనివాస్ వెంటనే సంబంధిత వైద్యులతో ఫోన్‌లో మాట్లాడి మెరుగైన చికిత్స అందించాలని ఆదేశించారు.

● వేములవాడను టెంపుల్ సిటీగా మారుస్తాం..

వేములవాడ టౌన్: వేములవాడ పట్టణాన్ని అన్ని రంగాల్లో అభివృద్ధి చేసి టెంపుల్ సిటీగా డెవలప్ చేస్తామని ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. పట్టణంలోని మూడో వార్డులో ఎస్డీఎఫ్ నిధులతో అభివృద్ధి పనులకు మున్సిపల్ చైర్‌పర్సన్ రామతీర్థపు మాధవితో కలిసి భూమి పూజ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆది శ్రీనివాస్ మాట్లాడు తూ పట్టణంలో 34 కుల సంఘ భవనాలకు నిర్మాణానికి ఎస్డీఎఫ్ నిధులను మంజూరు చేశామన్నారు. దేవాలయ అభివృద్ధితో పాటు అన్ని సమస్యలను పరిష్కరిస్తామని చెప్పారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్ చైర్మన్ బింగి మహేష్, కౌన్సిలర్ నిమ్మశెట్టి విజయ్, కాంగ్రెస్ నాయకులు కనికరపు రాకేష్, సంద్రగిరి శ్రీనివాస్, నాగుల విష్ణు తదితరులు ఉన్నారు.

విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలి: కలెక్టర్



సిబ్బందితో మాట్లాడుతున్న కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా

తంగళ్లపల్లి, ఆగస్టు 17: విద్యార్థులను అన్ని రంగాల్లో తీర్చిదిద్దాలని జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అన్నారు. శనివారం తంగళ్లపల్లి మండలం ఇందిరమ్మ కాలనీ గ్రామ శివారులోని గిరిజన సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలలో కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాల ఆవరణ, కంప్యూటర్ ల్యాబ్, లైబ్రరీ, డైనింగ్ హాల్‌ను పరిశీలించారు. పాఠశాలలోని విద్యార్థులు, ఉపాధ్యాయుల సంఖ్య బోధన తదితర అంశాలపై ఆరా తీశారు. అలాగే కిచెన్‌లో సిద్ధం చేస్తున్న అన్నం, కూర ఇతర ఆహార పదార్థాల నాణ్యతను పరిశీలించి అధికారులకు పలు సూచనలు చేశారు. మెనూ సక్రమంగా నిర్వహించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా తరగతి గదుల్లో ఫ్యాన్లు, విద్యుత్ దీపాల పనితీరును పరిశీలించారు. విద్యార్థులతో పాఠ్యాంశాలు చదివించారు. వారికి పలు ప్రశ్నలు వేసి... సమాధానాలు రాబట్టారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థులను పోటీ పరీక్షల్లో విజయం సాధించేలా సిద్ధం చేయాలన్నారు. ఇంగ్లీష్, మ్యాథ్స్, ఇతర సబ్జెక్టుల్లో రాణించేలా శిక్షణ ఇవ్వాలని ఆదేశించారు. పాఠశాల ఆవరణలో టాయిలెట్స్, నల్లాలు, సీపేజ్ సమస్యలను ప్రిన్సిపాల్ పద్మ వివరించారు. కలెక్టర్ వెంట డీఈవో రమేష్ కుమార్ ఉన్నారు.

అర్హులైన రైతులందరికీ రుణమాఫీ

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17: అర్హులైన రైతులందరికీ రుణమాఫీ వర్తించేలా ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు దొమ్మాటి నర్సయ్య అన్నారు. మూడో విడత రుణమాఫీ చేయడంపై హర్షం వ్యక్తం చేస్తూ మండలంలోని బండలింగంపల్లిలో నాయకులు, రైతులు సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి శనివారం క్షీరాభిషేకం చేశారు. స్థానిక బస్టాండు ప్రాంతంలో సంబరాలు నిర్వహించారు. టపాసులు పేల్చి మిఠాయిలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా నర్సయ్య మాట్లాడుతూ ఇచ్చిన మాట మేరకు మూడు విడతల్లో రుణమాఫీ చేసి రైతు ప్రభుత్వమని సీఎం రేవంత్‌రెడ్డి ప్రభుత్వం నిరూపించుకుందని అన్నారు. నాయకులు లక్ష్మారెడ్డి, రాంరెడ్డి, దేవయ్య, సంజీవరెడ్డి, రమేశ్, ఇమాం, హైమద్, ఎల్లాగౌడ్, బాలచంద్రారెడ్డి పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని కట్టలింగంపేట గ్రామంలో ప్రభుత్వం రైతులకు రుణమాఫీ చేయడంపై కాంగ్రెస్ పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు అవారు మనోహర్ ఆధ్వర్యంలో సీఎం రేవంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి కృతజ్ఞతలు తెలిపారు. రైతులు యువకులు కాంగ్రెస్ పార్టీ టపాసులు పేల్చి, స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో నాయకులు భైర్నేని అంజన్‌రావు, ఎల్లా దశరథం, పరశురాములు, రమేష్, నరేష్, ప్రవీణ్, కొమురయ్య, దేవరాజు కుంటయ్య, రాజు తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: మండలంలోని బావుసాయిపేటలో శనివారం కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి చిత్రపటానికి మంత్రి పొన్నం ప్రభాకర్, ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ చిత్రపటాలకు క్షీరాభిషేకం చేశారు. రైతులకు రెండు లక్షల రుణమాఫీ చేసిన సందర్భంగా రైతులు కాంగ్రెస్ నాయకులు హర్షం వ్యక్తం చేస్తూ క్షీరాభిషేకం చేశారు. కార్యక్రమంలో మండల అధ్యక్షుడు ఫిరోజ్ పాషా, టెక్కలదేవి శ్రీనివాస్, బి.శ్రీనివాస్, దేవయ్య, దయాకర్, సంజీవ్, హరీష్, శ్రీకాంత్ గౌడ్, ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్

గంభీరావుపేట, ఆగస్టు 17: అబద్ధాలతో అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ పార్టీ నేతలకు కేటీఆర్‌ను విమర్శించే స్థాయి లేదని బీఆర్‌ఎస్ మండల అధ్యక్షుడు పాపగారి వెంకటస్వామి ఆరోపించారు. గంభీరావుపేట బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన విలేఖకరుల సమావేశంలో వెంకటస్వామి మాట్లాడారు. అబద్దాల పునాదుల మీద అధికారం చేపట్టిన కాంగ్రెస్‌కు రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో ప్రజలు తగిన గుణపాఠం చెబుతారన్నారు. సమావేశంలో సెస్ డైరెక్టర్ నారాయణరావు, పట్టణ అధ్యక్షుడు పెద్దవేని వెంకటి, పార్టీ మండల ప్రధాన కార్యదర్శి గంధ్యాడపు రాజు, నాయకులు ఉన్నారు.

ఇల్లంతకుంట: రుణమాఫీ పేరుతో రైతులను కాంగ్రెస్ ప్రభుత్వం మోసం చేసిందని బీఆర్‌ఎస్ యూత్ అధ్యక్షుడు బుర్ర సూర్యగౌడ్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఎన్నికల ముందు రూ 41వేల కోట్లు మాఫీ చేస్తామని ప్రకటించిన సీఎం ఇప్పుడు రూ 18వేల కోట్లు మాత్రమే మాఫీ చేశారని పేర్కొన్నారు. సీఎం వెంటనే రైతులకు క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రవీణ్, గొజగాని కిషన్, రాములు యాదవ్, మహేష్‌యాదవ్, ప్రకాష్ తదితరులు పాల్గొన్నారు.

రుణమాఫీ కాని రైతుల పక్షాన పోరాటం చేస్తాం

ఇల్లంతకుంట, ఆగస్టు 17: వ్యవసాయ రుణమాఫీ కాని రైతుల పక్షాన పోరాటం చేస్తామని బీజేపీ మండల కన్వీనర్ దేశెట్టి శ్రీనివాస్ పేర్కొన్నారు. మండల కేంద్రంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం రెండు లక్షలలోపు రుణాలన్నింటినీ రద్దుచేసినట్లు పేర్కొంది. చాలా గ్రామాల్లో రైతుల రుణాలు మాఫీ కాలేదన్నారు. ఎన్నికల ముందు హామీ ఇచ్చినట్లు రైతులందరి రుణాలు మాఫీ చేయాలని డిమాండ్ చేశారు. సమావేశంలో మండల ప్రధానకార్యదర్శి తిప్పారపు శ్రావణ్, కిసాన్ మోర్చ అధ్యక్షుడు ఇట్టిరెడ్డి రవీందర్‌రెడ్డి, కాట్నపెల్లి రవీందర్‌రెడ్డి పాల్గొన్నారు..

నేడు విద్యుత్ సరఫరాలో అంతరాయం

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17: ఎల్లారెడ్డిపేట మండలం నారాయణపూర్‌లోని 33/11 కేవీ విద్యుత్ సబ్‌స్టేషన్‌లో మరమ్మత్తు పనుల నేపథ్యంలో ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం ఏర్పడుతోందని 'సెస్' ఏఈ పృథ్వీధర్ శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. నారాయణపూర్, బండలింగంపల్లి, ఎల్లారెడ్డిపేట రూరల్ ఫీడర్ పరిధుల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం 2 గంటల వరకు విద్యుత్‌సరఫరా ఉండదని పేర్కొన్నారు. వినియోగదారులు సహకరించాలని 'సెస్' ఏఈ పృథ్వీధర్ కోరారు.

జూనియర్ వైద్యురాలికి నివాళి

ఎల్లారెడ్డిపేట, ఆగస్టు 17: కోల్‌కతాలో హత్యాచారానికి గురైన జూనియర్ వైద్యురాలి ఆత్మకు శాంతి చేకూరాలని ఎల్లారెడ్డిపేట మండల కేంద్రంలోని యువకులు, వివిధ పార్టీల నాయకులు శనివారం రాత్రి కొవ్వొత్తుల ప్రదర్శన నిర్వహించారు. స్థానిక కొత్త బస్టాండు ప్రాంతం నుంచి పాత బస్టాండు వరకు ర్యాలీని కొనసాగింది. అనంతరం రెండు నిమిషాలు మౌనం పాటించారు. కార్యక్రమంలో యువకులు, వివిధ పార్టీల నాయకులు పాల్గొన్నారు.

చందుర్తి: మండలంలోని నర్సింగాపూర్ గ్రామంలో క్రీడా విజ్ఞాన కళ వేదిక ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. కార్యక్రమంలో క్రీడా విజ్ఞాన వేదిక సభ్యులు, స్థానిక నాయకులు, యువకులు, తదితరులు పాల్గొన్నారు.

కోనరావుపేట: జూనియర్ వైద్యురాలిపై హత్యాచార ఘటనను నిరసిస్తూ మండలంలోని ధర్మారం ప్రభుత్వ పాఠశాలలో కొవ్వొత్తులతో విద్యార్థులు ఉపాధ్యాయులు శనివారం నిరసన వ్యక్తం చేశారు. ఇలాంటి ఘటనలు ఇకముందు జరగకుండా ప్రభుత్వం చర్యలు చేపట్టాలని ఉపాధ్యాయులు, విద్యార్థులు కోరారు.

● విద్యార్థుల మానవహారం..

రుద్రంగి: కోల్‌కతాలో జూనియర్ వైద్యురాలిపై జరిగిన హత్యాచార ఘటనకు నిరసనగా రుద్రంగి మండల కేంద్రంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్ విద్యార్థులు మానవహారం చేపట్టారు. ఈ సందర్భంగా ఇందిరాచౌక్ చౌరస్తాలో విద్యార్థులు మానవహారంగా నిలబడి రెండు నిమిషాలు మౌనం పాటించారు. అనంతరం కొవ్వొత్తులతో నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ హరినాధ్ రాజు, విజయ్, సునీల్, రమేష్, సృజన్, కిరణ్, తదితరులు పాల్గొన్నారు.



రుద్రంగిలో మానవహారం చేపట్టిన విద్యార్థులు


ఘనంగా రుద్రహోమాలు



పూజలు నిర్వహిస్తున్న ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

సిరిసిల్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): సిరిసిల్లలోని శివభక్త భక్తమార్కండేయ స్వామి దేవాలయంలో అత్యంత వైభవోపేతంగా శ్రీచండీ మహాయాగాలు కొనసాగుతున్నాయి. శనివారం దేవతాహోమం, లక్ష్మీగణపతి, కుబేర, పాశుపత, రుద్రహోమాలు జపపారాయణాలు ఘనంగా నిర్వహించారు. మహాలింగార్చన నిర్వహించారు. మహా చండీయాగంలో ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. చండీ యాగంలో సిరిసిల్ల మున్సిప ల్ చైర్‌పర్సన్ జిందం కళచక్రపాణి, చేనేత జౌళి శాఖ ఏడీ సాగర్, మున్సిపల్ వైస్ చైర్మన్ మంచె శ్రీనివాస్, టెక్స్‌టైల్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ గూడూరి ప్రవీణ్, పద్మశాలీ సంఘం అధ్యక్షుడు గోలి వెంకటరమణ, సెస్ డైరెక్టర్ దార్నం లక్ష్మీనారాయణ, కాంగ్రెస్ మాజీ పట్టణ అధ్యక్షుడు సంగీతం శ్రీనివాస్ యాగంలో పాల్గొన్నారు.

రాజన్న క్షేత్రంలో భక్తుల సందోహం



శనీశ్వరుడికి అభిషేకం చేస్తున్న భక్తులు

వేములవాడ కల్చరల్, ఆగస్టు 17: వేములవాడ రాజ రాజేశ్వరస్వామి వారి క్షేత్రం భక్తులతో సందోహంగా మారింది. శ్రావణ మాసం సందర్భంగా రోజురోజుకు రాజన్న ఆలయానికి భక్తుల తాకిడి పెరుగుతోంది. శనివారం ధర్మదర్శనం, శీఘ్రదర్శనం, బ్రేక్ దర్శనం క్యూలైన్‌లలో భక్తులు ఆలయంలోకి ప్రవేశించి పార్వతిపరమేశ్వరులను దర్శించుకున్నారు. కోడెమొక్కులు చెల్లించుకుని కుంకుమ పూజలో పాల్గొన్నారు. భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ఆలయ ఈవో వినోద్‌రెడ్డి నేతృత్వంలో ఆలయ ఏఈవోలు బ్రహ్మన్నగారి శ్రీనివాస్, రమేష్‌బాబు, ఆలయ సూపరింటెండెంట్ తిరుపతిరావు, పీఆర్వో రాజన్‌బాబు, ఎడ్ల శివసాయిలు ఏర్పాట్లను పర్యవేక్షించారు.

శని త్రయోదశి సందర్భంగా ప్రత్యేక పూజలు..

శ్రావణమాసం శని త్రయోదశి సందర్భంగా భీమేశ్వర ఆలయంలోని శనీశ్వరునికి భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. శనీశ్వరుడికి ఎంతో పవిత్రమైన రోజు కావడంతో భక్తులు శనీశ్వరుడి విగ్రహానికి నువ్వుల నూనేతో అభిషేకం చేసి నువ్వులతో నైవేద్యంతో నల్లటి వస్త్రాన్ని స్వామి వారికి సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు.

అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు కార్యాచరణ

- అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ - కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్

సిరిసిల్ల, ఆగస్టు 17 (ఆంధ్రజ్యోతి): అర్హులకు పోడు పట్టాలు అందించేందుకు పటిష్ట కార్యాచరణ చేపట్టాలని, పోడు పట్టాల కోసం పెండింగ్‌లో ఉన్న దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి అర్హత ఉంటే పట్టాలు పంపిణీ చేయాలని అటవీ, పర్యావరణ, దేవాదాయ శాఖ మంత్రి కొండా సురేఖ సూచించారు. శనివారం హైదరాబాద్ నుంచి మంత్రులు, కొండా సురేఖ, సీతక్క, జిల్లా కలెక్టర్లు, ఎమ్మెల్యేలతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. రాజన్న సిరిసిల్ల జిల్లా కలెక్టరేట్ నుంచి ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్, కలెక్టర్ సందీప్‌కుమార్ ఝా వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్నారు. అటవీ భూముల విస్తీర్ణం, ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం, జారీ చేసిన పోడు భూముల పట్టాలు, పెండింగ్ దరఖాస్తుల వివరాలను ఉన్నతాధికారులు వివరించారు. ఈ సందర్భంగా మంత్రి సురేఖ మాట్లాడుతూ ఆర్‌వోఎఫ్‌ఆర్ చట్టం ప్రకారం గతం నుంచి సాగు చేసుకుంటున్న అటవీ భూములకు మాత్రమే పట్టాలు అందించాలన్నారు. కొత్తగా అటవీ భూమి సాగు చేయడానికి వీలులేదని, అటవీ భూములను సంరక్షించడానికి క్షేత్రస్థాయిలో అటవీ శాఖ అధికారులు పకడ్బందీగా చర్యలు తీసుకోవాలన్నారు. రాష్ట్రంలోని గిరిజనులు, ఆదివాసీలకు మాత్రమే పట్టాలు మంజూరు చేయాలని వలసవచ్చి అటవీ ప్రాంతంలో చెట్లు నరికివేస్తే కఠినంగా వ్యవహరించాలని సూచించారు. పంచాయతీరాజ్ శాఖ మంత్రి సీతక్క మాట్లాడుతూ గిరిజనులకు అటవీ శాఖ వ్యతిరేకమనే భావన తొలగించే విధంగా పనిచేయాలన్నారు. కొత్తగా అడవుల నరికివేత జరగకుండా కట్టుదిట్టమైన చర్యలు తీసుకోవాలని, చెట్ల నరికివేత వల్ల జరిగే నష్టాలను ప్రచారం చేయాలని అటవీ భూములపై పక్కా నిఘా ఉండాలన్నారు. అటవీ భూముల అనుమతుల కారణంగా గిరిజన, ఆదివాసీ ప్రాంతాల్లో అభివృద్ధి కార్యక్రమాల్లో ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు.



వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న ఆది శ్రీనివాస్, కలెక్టర్

● 27 మందికి పట్టాలు వచ్చాయి: విప్

జిల్లాలో పోడు భూముల పట్టాల కోసం 507 మంది ప్రభుత్వానికి దరఖాస్తులు సమర్పిస్తే కేవలం 27 మందికే పట్టాలు వచ్చాయని మిగిలిన లబ్ధిదారులకు పట్టాలు అందేలా చూడాలని ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ కోరారు. జిల్లాలోని వీర్నపల్లి, కోనరావుపేట, చందుర్తి, గంభీరావుపేట, రుద్రంగి, ఎల్లారెడ్డిపేట మండలాల్లోని గిరిజనులకు పోడు పట్టాలు రాలేదని మరోసారి రీ సర్వే నిర్వహించి పట్టాలు పంపిణీ చేయాలని అన్నారు. మోత్కురావుపేట-చందుర్తి రోడ్డు పనులు అటవీ అనుమతుల కారణంగా అర్ధాంతరంగా ఆగిపోయాయన్నారు. ఈ రోడ్డు నిర్మాణం జరిగితే ఖానాపూర్ నుంచి హైదరాబాద్, వయా రాయికల్ వెళ్లడానికి 35 కిలోమీటర్ల మేరకు ప్రయాణ భారం తగ్గుతుందన్నారు. అటవీ ప్రాంతంలో 3.5 కిలోమీటర్లు రోడ్డు వేయడానికి అవసరమైన అనుమతులు అందేలా చూడాలని కోరారు. కాన్ఫరెన్స్‌లో జిల్లా అటవీ శాఖ అధికారి బాలమణి, జిల్లా గిరిజన సంక్షేమ అధికారి జనార్దన్ తదితరులు పాల్గొన్నారు.

మాజీ మంత్రి కేటీఆర్ దిష్టిబొమ్మ దహనం



కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేస్తున్న నాయకులు

సిరిసిల్ల టౌన్, ఆగస్టు 17: తెలంగాణ మహిళలకు బీఆర్‌ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ మాజీ మంత్రి కేటీఆర్ క్షమాపణ చెప్పేంత వరకు అడ్డుకుంటామని కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షురాలు కాముని వనిత అన్నారు. శనివారం సిరిసిల్ల పట్టణం అంబేద్కర్ చౌరస్తా వద్ద ఉచిత బస్సులో ప్రయాణించే మహిళలను కించపరిచే విధంగా కేటీఆర్ అనుచిత వ్యాఖ్యలు చేయడాన్ని నిరసిస్తూ కేటీఆర్ దిష్టిబొమ్మను దహనం చేశారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ జిల్లా మహిళ అధ్యక్షురాలు కాముని వనిత, పట్టణ అధ్యక్షురాలు వెల్ముల స్వరూప మాట్లా డారు. కాంగ్రెస్ ప్రభుత్వం తెలంగాణ ప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలను చూసి బీఆర్‌ఎస్ పార్టీ ఓర్వలేక పోతుందని ఆరోపిం చారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన మాట ప్రకారం తెలంగాణ మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకం అందిస్తే అందులో ప్రయాణి స్తున్న మహిళల పట్ల కేటీఆర్ చేసిన అనుచిత వ్యాఖ్యలను ఖండిస్తున్నామన్నారు. కార్యక్రమం లో కాంగ్రెస్ పార్టీ మహిళ విభాగం సిరిసిల్ల పట్టణ ప్రధాన కార్యదర్శి కోడం అరుణ, మాజీ కౌన్సిలర్ మడుపు శ్రీదేవి, పట్టణ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షుడు చొప్పదండి ప్రకాష్, బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు సూర దేవరాజు, పాల్గొన్నారు.

తంగళ్లపల్లి: మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేశాడంటూ తంగళ్లపల్లి మండల కేంద్రంలో సిరిసిల్ల శాసనసభ్యుడు కేటీఆర్ దిష్టిబొమ్మను కాంగ్రెస్ నాయకులు దహనం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ కేటీఆర్ క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. కాంగ్రెస్ మండల అధ్యక్షుడు జలగం ప్రవీణ్, నాయకులు లింగాల భూపతి, సత్తు శ్రీనివాస రెడ్డి, భైరినేని రాము, పొన్నాల పరశురాములు, ఎగుర్ల ప్రశాంత్, గుగ్గిల భరత్ గౌడ్ పాల్గొన్నారు.

గురుకుల విద్యార్థులకు వైద్య పరీక్షలు

వేములవాడ, ఆగస్టు 17: వేములవాడ పట్టణంలోని బోయినపల్లి బాలుర గురుకుల పాఠశాలలో జిల్లా వైద్యాధికారి వసంతరావు ఆధ్వర్యంలో శనివారం వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా ఆదేశాల మేరకు పాఠశాలల్లోని విద్యార్థులకు సీజనల్ వ్యాధులను గుర్తించి చికిత్సలు అందించేందుకు వైద్య శిబిరం ఏర్పాటు చేశామని తెలిపారు. 450 మంది విద్యార్థులకు వైద్య పరీక్ష నిర్వహించడమే కాకుండా గుండె పరీక్షలు కూడా నిర్వహించామని తెలిపారు. విద్యార్థులకు స్వల్పంగా జ్వరాలు ఉన్నందున అవసరమైన మందులు అందజేశామని ఆయన తెలిపారు. కార్యక్రమంలో ఏరియా ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ పెంచలయ్య, వైద్య అధికారులు దివ్యశ్రీ, రమణ, ఆర్‌బిఎస్‌కే వైద్యులు సిబ్బంది ఉన్నారు.

సంక్షిప్త సమాచారం..

చందుర్తి: మండలంలోని నర్సింగపూర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు ఉపాధ్యాయులు శ్రీనివాస్, స్వప్న రమేష్ శనివారం మైక్ సెట్‌ను అందజేశారు. విద్యార్థులకు ఐడెంటిటీ కార్డు హిందీ ఉపాధ్యాయురాలు అవధానుల కవిత రాణి, బహూకరించారు.

ఇల్లంతకుంట: మండలంలోని పెద్దలింగాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించారు. పాఠశాల ఆవరణలో ఏర్పాటు చేసిన వైద్యశిబిరంలో 84మంది విద్యార్థులకు వైద్యపరీక్షలు నిర్వహించి, మందులను పంపిణీ చేశారు.

ఎల్లారెడ్డిపేట: మండలంలోని బొప్పాపూర్‌లో తెలంగాణ భవన మరియు ఇతర నిర్మాణ కార్మిక సంక్షేమ మండలి ఆధ్వర్యంలో భవన కార్మికులకు వైద్య శిబిరం నిర్వహించారు. శిబిరం జిల్లా కో-ఆర్డినేటర్ శ్రీనివాస్, శిబిరం కో-ఆర్డినేటర్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

వీర్నపల్లి: మండలంలోని గర్జనపల్లి ఉన్నత పాఠశాల అభివృద్ధి కమిటీ చైర్మన్‌గా పూర్వ విద్యార్థి, కాంగ్రెస్ నాయకడు బుచ్చగారి రాకేష్‌గౌడ్ ఎన్నికయ్యారు.

- వీర్నపల్లి మండలం గర్జనపల్లి గ్రామం నిరుపేద కుటుంబానికి చెందిన ఇసంపల్లి కిష్టవ్వ ఒక్కగానొక్క కొడుకు జనశక్తిలో చేరి దాదాపు 24 ఏళ్ళ క్రితం నూకలమర్రిలో జరిగిన ఎన్‌కౌంటర్‌లో మృతి చెందాడు. ఆమె భర్త కూడా కొద్ది రోజుల క్రితం అనారోగ్యంతో మృతి చెందాడు. ఆరోగ్యం సహకరించకపోవడంతో కేవలం పెన్షన్ మీద ఆధారపడి జీవిస్తోంది. విషయం తెలుసుకున్న వేములవాడకు చెందిన సామాజిక కార్యకర్త, యువ చైతన్య దీపం ఫౌండేషన్ చైర్మన్ శేఖర్ సేనాపతి తక్షణమే స్పందించి మూడు నెలలకు సరిపడా నిత్యావసర వస్తువులు అందించారు.

సిరిసిల్ల రూరల్: సిరిసిల్ల పట్టణంలోని సిద్ధార్థ ఇంగ్లీష్ మీడియం పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఇటీవల వెలువడిన నీట్ 2024 ఫలితాల్లో రాష్ట్ర వ్యాప్తంగా 134వ ర్యాంక్ సాధించిన కోడం ప్రణతి, తెలంగాణపబ్లిక్ సర్వీస్ కమీషన్ వెల్లడించిన ఫలితాల్లో ఎఈఈ ఉద్యోగం సాధించిన మిట్టపల్లి శ్రీలేఖలను ఘనంగా సన్మానించారు .కరస్పాండెంట్ నాగుల సంతోష్‌గౌడ్, ప్రిన్సిపాల్ సుధాకర్‌పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని గోరంటాలలో దండవేణి నాగరాణికి సీఎం సహాయ నిధి నుంచి మంజూరైన రూ. 30 వేల చెక్కును కాంగ్రెస్ మండల అధ్యక్షుడు హమీద్, జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపతి, జిల్లా కార్యదర్శి రామచంద్రం అందజేశారు.

- గంభీరావుపేట మండల కేంద్రానికి చెందిన ఓ ప్రముఖ పార్టీ నేతకు దేహశుద్ధి జరగడం స్థానికంగా కలకలం రేపుతోంది. హైదరాబాద్‌లో ఓ వివాహితలో ఉన్న సమయంలో తన భార్య రెడ్‌హ్యాండెడ్‌గా దొరికి, దేహశుద్ధికి గురయ్యాడు. అక్కడి నుండి ఇద్దరిని కొత్తపల్లికి తీసుకవచ్చి మరోసారి చితకబాదారు. వివాహేతర సంబంధం పెట్టుకున్న భర్తను భార్యనే దేహశుద్ధి చేసిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది.

విద్యాసంస్థల్లో ముందస్తు రక్షాబంధన్ వేడుకలు



ఇల్లంతకుంటలో రాఖీలు కట్టుకుంటున్న విద్యార్థినులు



సిరిసిల్ల పట్టణంలోని నెహ్రూనగర్ స్కూల్‌లో..



చందుర్తి మండలంలో..

సిరిసిల్ల రూరల్, ఆగస్టు 17 : సిరిసిల్ల పట్టణంలోని పలు ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో రక్షాబంధన్ వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని కృష్ణవేణి టాలెంట్ స్కూల్, నెహ్రూనగర్ ప్రాథమిక, జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలతోపాటు సిరిసిల్ల అర్బన్ పరిధిలోని చంద్రంపేట జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలల్లో ప్రధానోపాధ్యాయులు, ప్రిన్సిపాల్‌లు విద్యార్థులకు రాఖీ కట్టించారు. కార్యక్రమాలలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్ కరస్పాండెంట్ రాజురెడ్డి, నెహ్రూనగర్ జిల్లా పరిషత్ స్కూల్ ప్రధానోపాధ్యాయులు నాగుల భాగ్యరేఖ, చంద్రంపేట జిల్లాపరిషత్‌స్కూల్ ప్రధానోపాధ్యాయులు వీఎం శ్రీనివాస్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఇల్లంతకుంట: మండల కేంద్రంలోని ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలో ఆర్‌ఎస్ఎస్ ఆధ్వర్యంలో రక్షాబంధన్ వేడుకలు జరిగాయి. అనంతరం కళ్యాణ మండపంలో జరిగిన కార్యక్రమంలో జిల్లా సహ శారీరక్ ప్రముఖ్ ఎలిగేటి వంశీకృష్ణ మాట్లాడారు. కార్యక్రమంలో విశ్రాంత ఉపాధ్యాయుడు తూముకుంట మోహన్ రెడ్డి, ఖండ కార్యవాహ తాటిపెల్లి మహేష్, వ్యవస్థ ప్రముఖ్ కాసుపాక కిషన్, శారీరక్ ప్రముఖ్ కంకటి శ్రీకాంత్‌లతో పాటు స్వయంసేవక్ పాల్గొన్నారు.

గంభీరావుపేట: మండలంలోని దమ్మన్నపేట జిల్లా పరిషత్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో రక్షాబంధన్ కార్యక్రమాన్ని ముందస్తుగా నిర్వహించారు. మండల కేంద్రంలోని ఆక్స్‌ఫర్డ్, శ్రీ విద్యానికేతన్ ఇంగ్లీష్ మీడియం పాఠశాలల్లో రక్ష భంధన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ప్రధాన కూడళ్లలో విద్యార్థినులతో రాఖీలను కట్టించి, రక్ష భంధన్ ప్రాముఖ్యాన్ని వివరించారు.

చందుర్తి: మండల కేంద్రంతో పాటు మల్యాల, సనుగుల గ్రామాల్లోని ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థినులు విద్యార్థులకు రాఖీలు కట్టి శుభాకాంక్షలు తెలిపారు. కార్యక్రమాల్లో ప్రధానోపాధ్యాయులు వేముల సుజాత, ఝాన్సీ, ముఖేష్, మల్యాలలో వివేకానంద సేవా సమితి సభ్యులు, విశ్వహిందూ పరిషత్ నాయకులు పార్టీ సుధాకర్, లింగంపల్లి మధు, లోకోజు సతీష్, దురిశెట్టి రాజు, గంగాధర్ ముఖేష్, దివ్యసాగర్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రుద్రంగి: మండల కేంద్రంలో ఆర్ఎస్ఎస్ ఆధ్వర్యంలో అన్ని ప్రభుత్వ, ప్రైవేట్ పాఠశాలల్లో జరిగిన వేడుకల్లో బీజేపీ ఓబీసీ మోర్చా జిల్లా అధ్యక్షులు నంద్యాడపు వేంకటేష్, శ్రావణ్, వసంత్, నవీన్, సంతోష్ పాల్గొన్నారు.

● రుద్రంగి మండల కేంద్రంలో కృష్ణవేణి టాలెంట్ స్కూల్‌లో విద్యార్థులు రాఖీ ఆకారంలో కూర్చున్నారు. కార్యక్రమంలో కరస్పాండెంట్ ఎలిగేటి నరేష్, ప్రిన్సిపాల్ హరినాద్‌రాజు, తదితరులు పాల్గొన్నారు.

బోయిన్‌పల్లి: బోయిన్‌పల్లి మండలంలోని విలాసాగర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయులు బొలగం శ్రీనివాస్ ఆధ్వర్యంలో రాఖీ వేడుకలు వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగా మహిళా ఉపాధ్యాయులు ఉపాధ్యాయు లకు, విద్యార్థులకు విద్యార్థినులు రాఖీలు కట్టారు. విద్యార్థులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



విలాసాగర్‌లో రాఖీలు కడుతున్న ఉపాధ్యాయినీలు